
సాక్షి వనపర్తి

బుధవారం ၊ 4 ၊ జనవరి ၊ 2023



15 నుంచి బ్రహ్మోత్సవాలు

సింగోటం లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు 15వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి.

వివరాలు 10లో ▸



ముగిసిన దేహదారుఢ్య పరీక్షలు

ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు మంగళవారం ముగిశాయి.

వివరాలు 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
31.0 /18.0

వాతావరణం

ఉదయం, సాయంత్రం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తెల్లవారుజామున మంచు కురుస్తుంది. రాత్రి చలి తీవ్రత పెరగొచ్చు.

న్యూస్‌రీల్

వైద్య కళాశాలలో తరగతులు ప్రారంభం



వనపర్తి: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో మంగళవారం నుంచి అధికారికంగా తరగతులు ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ సునందిని తెలిపారు. కళాశాల థియరీహాల్‌లో మొదటిరోజు విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఓరియంటేషన్ తరగతులు నిర్వహించారు. ప్రిన్సిపాల్‌తో పాటు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డా. నరేంద్రకుమార్, ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కళాశాల, హాస్టల్ వేళలు, ర్యాగింగ్, సబ్జెక్టులు, లైబ్రరీలో అందుబాటులో ఉండే పుస్తకాలు, ఏయే సంవత్సరం విద్యాబోధన ఎలా ఉంటుంది. థియరీ, ప్రాక్టికల్ క్లాసులు ఎప్పుడెప్పుడు ఉంటాయి. వైద్యులుగా తయారై సమాజానికి చేయాల్సిన సేవలు, వైద్యసేవలు అందించే సమయంలో పాటించాల్సిన నిబంధనలు, మానవత్వం తదితర అంశాల గురించి వివరించారు. వైద్యులుగా విలువలు, కనీస ధర్మం పాటిస్తామంటూ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ దేవదాస్, బోధన, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు స్వాగతం పలుకుతూ కళాశాల ఎంట్రెన్స్‌లో ఏర్పాటు చేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి.

యువత అన్నింటా రాణించాలి

- మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్



వనపర్తి క్రైం: యువత చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉన్నతంగా రాణించాలని మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ కోరారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆడిటోరియంలో జిల్లా యువజన క్రీడలశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి యువజనోత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యువత స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకొని సమాజ శ్రేయస్సుకు పాటుపడాలన్నారు. అందిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని చదువుల్లో రాణించాలని సూచించారు. అనంతరం విద్యార్థుల జానపద నృత్యాలు, గీతాల ఆలాపన కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఉపన్యాస, కబడ్డీ పోటీలు నిర్వహించారు.

విజేతలు వీరే..

జానపద నృత్య ప్రదర్శనలో 8 బృందాలు పాల్గొనగా వనపర్తి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల శ్వేత బృందం మొదటి, ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాల అఖిల బృందం ద్వితీయ, పాలిటెక్నిక్ కళాశాల రాజేశ్వరి బృందం తృతీయ స్థానాల్లో నిలిచాయి. జానపద బృంద గేయాల్లో 10 గ్రూపులు పాల్గొనగా.. వనపర్తి మహిళా డిగ్రీ కళాశాల మునీశ్వరి మొదటి, ప్రభుత్వ జూనియర్ కళాశాల అనూష గ్రూప్ ద్వితీయ, హన్మంతు అండ్ గ్రూపు తృతీయ బహుమతి సాధించాయి. ఉపన్యాస పోటీలో కంచిరావుపల్లికి చెందిన శిరీష మొదటి, అనూష ద్వితీయ, శారద తృతీయ బహుమతి పొందారు. కబడ్డీ బాలురలో చిన్నంబావికి చెందిన లోకేష్, రాకేష్, బాలికల విభాగంలో రాయినిపల్లికి చెందిన నాగేశ్వరి, గోప్లాపూర్‌కు చెందిన అనిత ప్రతిభ కనబర్చారు. జానపద నృత్యం, గేయం, ఉపన్యాసంలో మొదటి స్థానం సాధించిన అభ్యర్థులు, కబడ్డీలో ఎంపికైన నలుగురు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని జిల్లా యువజన క్రీడల అధికారి సయ్యద్ రహమాన్ తెలిపారు.

పడకేసిన బృహత్ ప్రణాళిక !



విలీన గ్రామాలను పరిశీలిస్తున్న కన్సల్టెన్సీ బృందం (ఫైల్)

- పుష్కర కాలం అవుతున్నా.. ముందుకు సాగని వైనం
- మూడేళ్ల కిందట డ్రాఫ్ట్ రూపొందించినా.. పడని అడుగులు

వనపర్తి టౌన్: వనపర్తి పురపాలిక బృహత్ ప్రణాళిక (మాస్టర్ ప్లాన్)పై సందిగ్ధం నెలకొంది. పుష్కర కాలం కిందట చేపట్టాల్సి ఉన్నా.. నేటికీ అడుగులు పడటం లేదు. నాలుగేళ్ల కిందట కొంత హడావిడి చేసినా తిరిగి చల్లబడింది. 1992లో రూపొందించిన మాస్టర్ ప్లాన్ 2011లో పునరుద్ధరించాల్సి ఉన్నా.. ఆ దిశగా ప్రభుత్వాలు, పాలకులు చొరవ చూపడం లేదు. ఇదే పట్టణాభివృద్ధికి గొడ్డలిపెట్టుగా మారింది. అస్తవ్యస్తంగా ఉన్న రహదారులు మంత్రి నిరంజన్‌రెడ్డి చొరవతో విస్తరిస్తున్నప్పటికీ.. అడ్డగోలు నిర్మాణాలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొత్త ప్రణాళిక అమలులోకి వస్తే పట్టణ రూపురేఖలు భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మారే అవకాశం ఉంది. జిల్లా ఏర్పాటుతో పట్టణం రోజురోజుకు విస్తరిస్తున్నా.. మాస్టర్ ప్లాన్ పూర్తిస్థాయిలో అమలుగాక పట్టణవాసులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రస్తుత జనాభా అవసరాలకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్ రూపొందించాలని ప్రభుత్వం నాలుగేళ్ల క్రితం ఉత్తర్వులు జారీ చేసినా పురోగతి అంతంత మాత్రంగానే ఉంది.

పెరిగిన జనాభాకు అనుగుణంగా..

పెరిగిన జనాభాకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్ తయారీకి ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేయడంతో డీడీఎఫ్ ప్రైవేట్ కన్సల్టెన్సీ టెండర్లు దక్కించుకుంది. వనపర్తి పురపాలికలో మొత్తం 33 వార్డులతో పాటు పట్టణంలోని ప్రధాన కూడళ్లు, సరిహద్దు ప్రాంతాలు, రహదారులను గుర్తించి అధికారులతో కలిసి లోతుగా అధ్యయనం చేసింది. 22 ఏళ్లకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్ అమలు చేసేందుకు పలుమార్లు మున్సిపాలిటీని సందర్శించి పూర్తిస్థాయి నివేదిక రూపొందించింది. ఆ నివేదికలోని అంశాలను అన్నిశాఖల అధికారులు, పాలకవర్గ సభ్యులకు వివరించింది.

విలీన గ్రామాలతో..

పురపాలికలో విలీనమైన నాలుగు గ్రామాలను కలుపుకొని మాస్టర్ ప్లాన్ రూపొందించాల్సి ఉంది. పట్టణ బేస్‌మ్యాప్ సిద్ధంగా ఉండగా.. విలీన గ్రామాల బేస్‌మ్యాప్ తయారు చేయడంలో కన్సల్టెన్సీ బిజీ అయినట్లు తెలుస్తోంది. బృహత్ ప్రణాళిక తర్వాత ప్రజల నుంచి అభ్యంతరాలు, సూచనలు, సలహాలు స్వీకరించి అప్పుడు డ్రాఫ్ట్ తయారుచేసి అమలుకు చర్యలు తీసుకుంటారని.. ఇందుకు మరికొన్ని నెలల సమయం పడుతుందని అధికార యంత్రాంగం అంటోంది.

వనపర్తి పురపాలికలో..

వార్డులు	కాలనీలు	నివాసాలు
33	56	16,530

జనాభా 74,016

తాగునీటి పథకాలు

రామన్‌పాడు పాత పథకం 4.5 ఎంఎల్‌డీ

కొత్త పథకం 8 ఎంఎల్‌డీ

మిషన్ భగీరథ గ్రిడ్ 2.5 ఎంఎల్‌డీ



వనపర్తి పట్టణ వ్యూ

కొత్త మాస్టర్ ప్లాన్..



మాస్టర్‌ప్లాన్ అమలుకు ప్రభుత్వం రాష్ట్రస్థాయిలో విధాన నిర్ణయం అమలు చేయనుంది. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని త్వరలోనే మాస్టర్ ప్లాన్ రూపురేఖలు మారుతాయి. కరోనాకు ముందు ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా మాస్టర్‌ప్లాన్ చిత్రపటాన్ని రూపొందించారు. గతంలో రూపొందించిన అంశాలు, గణాంకాలను పరిగణలోకి తీసుకొని కొత్త మాస్టర్‌ప్లాన్ రూపొందించే అవకాశం ఉంది. మరికొన్ని రోజుల్లో స్పష్టత వస్తుంది. – విక్రమసింహారెడ్డి, పుర కమిషనర్, వనపర్తి

మ్యాప్‌లో మార్పులు..

క్షేత్రస్థాయిలో భవనాలు, మురికివాడలు, గణాంకల వివరాలు లోతుగా సేకరించి తాత్కాలిక మ్యాప్‌ను రూపొందించారు. అప్పట్లో విలీన గ్రామాల విషయం ఓ కొలిక్కి రాకపోవడంతో మళ్లీ మ్యాప్ రూపొందిస్తామని చెప్పారు. కొత్త మ్యాప్‌లో పట్టణ భౌగోళిక పరిధికి సంబంధించి క్షేత్రస్థాయిలో సర్వేచేసి రూపొందించిన మ్యాప్‌లు సిద్ధమవుతున్నట్లు అధికారులు అప్పట్లో వెల్లడించారు. పట్టణ విస్తీర్ణం భారీగా పెరిగిన నేపథ్యంలో బృహత్ ప్రణాళికలో ఉన్న నివాస సముదాయ ప్రాంతాలు, పారిశ్రామిక, వాణిజ్య, వ్యవసాయ, గ్రీన్ జోన్ల నిర్ధారణలో మార్పులు రానున్నాయి. ఉదాహరణకు పట్టణంలోని కొత్తకోట రోడ్డు ప్రాంతం ప్రస్తుత బృత్ ప్రణాళికలో పారిశ్రామిక ప్రాంతంగా ఉండగా.. కొత్త ప్రణాళిక అమల్లోకి వస్తే నివాస ప్రాంతంగా మారనుంది. ఇలా పట్టణంలో పలు ప్రాంతాల స్థితిగతుల్లో మార్పు రానుంది.

103 బృందాలతో ‘కంటివెలుగు’



వీసీలో మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి. చిత్రంలో కలెక్టర్ షేక్ యాస్మిన్‌బాషా, అదనపు కలెక్టర్

- విస్తృత ప్రచారంతోనే విజయవంతం
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వనపర్తి: వనపర్తి, నాగర్‌కర్నూల్, గద్వాల జిల్లాల్లోని 971 గ్రామపంచాయతీలు, 236 మున్సిపల్ వార్డుల్లో కంటివెలుగు శిబిరాలు ఏర్పాటుచేసి 103 బృందాలతో వందరోజుల్లో ప్రతి ఒక్కరికీ కంటి పరీక్షలు నిర్వహించేందుకు పక్కా ప్రణాళిక రూపొందించినట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి వెల్లడించారు. మంగళవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వైద్య, ఆరోగ్యశాఖ, పంచాయతీరాజ్, విద్యుత్, పశుసంవర్ధకశాఖ మంత్రులు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి మంత్రి నిరంజన్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఈ నెల 18 నుంచి ప్రారంభమయ్యే మలి కంటివెలుగుకు కావాల్సిన ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు విస్తృత ప్రచారం చేయాలని అధికారులను ఆదేశించామని తెలిపారు. జిల్లాలోని 255 గ్రామపంచాయతీలు, అయిదు మున్సిపాలిటీల్లో నిర్వహించే కంటివెలుగు కార్యక్రమంలో 30 రోజులు రాత్రి బస చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా కలెక్టర్ పది రోజులు, జిల్లా అధికారులు 10 రోజులు ప్రత్యేక రాత్రి బసలు చేయనున్నట్లు వివరించారు. జనవరి 9, 10 తేదీల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తామని చెప్పారు. సమావేశంలో కలెక్టర్ షేక్ యాస్మిన్‌బాషా, అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్, జెడ్పీ సీఈఓ వెంకటరెడ్డి, డీఎంహెచ్ఓ డా. రవిశంకర్, డిప్యూటీ డీఎంహెచ్ఓ శ్రీనివాసులు, జిల్లా అధికారులు, అయిదు మున్సిపాలిటీల చైర్మన్లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు



మాట్లాడుతున్న డీఐఈవో జాకీర్ హుస్సేన్

కొత్తకోట రూరల్ (పెద్దమందడి): విద్యార్థులు ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని డీఐఈవో జాకీర్ హుస్సేన్ అన్నారు. మంగళవారం పెద్దమందడి ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ల్యాబ్‌లో ఉన్న విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యాలయంలో పలు రికార్డులను తనిఖీ చేశారు. అధ్యాపకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ.. పరీక్షల సమయం దగ్గర పడుతుందని, వార్షిక పరీక్షలతో పాటు గణితం, సైన్స్ సబ్జెక్టులపై పూర్తిపట్టు సాధించి ఎంసెట్‌లో ర్యాంకు సాధించాలని ఆకాంక్షించారు. జనవరి నుంచి అధ్యాపకులు ఎంసెట్ ప్రత్యేక శిక్షణతో పాటు రివిజన్ తరగతులు నిర్వహిస్తారని.. సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేందుకు అధ్యాపకులు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రిన్సిపాల్ భాస్కర్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

చీకట్లో వెలుగు దివ్వెలు

స్పర్శ, శబ్దంతో జ్ఞాననేత్రానికి పదును



ఆ విద్యార్థులు క్రికెట్ ఆడుతారు. చెస్ బోర్డుపై ఎత్తులు వేస్తారు. మ్యూజిక్ వాయిస్తారు. కంప్యూటర్‌పై కూర్చొని కీబోర్డును చక్కగా ఆపరేట్ చేస్తుంటారు. వీటిలో గొప్పేముంది అనుకోవచ్చు. కానీ వారందరూ అంధులు. పుట్టకతోనే, ప్రమాదవశాత్తో చూపు పోగొట్టుకున్న చిన్నారులను ఆ ఆశ్రమం అక్కున చేర్చుకుంది. మిగతా పిల్లలందరిలాగానే చదువు, వివిధ రకాల విద్యలు నేర్పిస్తూ సమాజంలో స్వతంత్రంగా జీవించే అవకాశాలు కల్పిస్తోంది. కళ్లులేవని వారు కలత చెందకుండా కేవలం స్పర్శ, శబ్దం, వాసనల ఆధారంగానే వారు అన్ని పనులూ సమర్థంగా చేస్తున్నారు. నేత్రాలను కోల్పోయినా తమ జ్ఞాననేత్రానికి పదును పెడుతూ అన్ని రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్నారు. లక్ష్యాన్ని నిర్దేశించుకొని విజయం సాధిస్తూ చీకటిలో వెలుగులు చూస్తున్నారు. ఆరు చుక్కల లిపితో చూపులేని వారి జీవితాల్లో వెలుగులు నింపిన లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా.. అంధత్వానికి సవాల్ విసురుతూ విజేతలుగా నిలుస్తున్న విద్యార్థులు, వారికి అక్షర జ్ఞానాన్ని పంచుతున్న ఉపాధ్యాయులు, ఆశ్రమ పాఠశాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

– సాక్షి, మహబూబ్‌నగర్ డెస్క్

- అంధ విద్యార్థులకు వరంగా పాలమూరు ఆశ్రమ పాఠశాల
- ఒకటి నుంచి ఇంటర్ వరకు ఉచిత విద్యను అందిస్తున్న వైనం
- జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లోనూ సత్తా చాటిన విద్యార్థులు
- ఇక్కడ చదువుకున్న 300 మందికి ప్రభుత్వ, ప్రైవేట్ శాఖల్లో ఉద్యోగాలు



చెస్ ఆడుతున్న విద్యార్థినులు



క్రికెట్ ఆడుతున్న విద్యార్థి

300 మందికి ఉద్యోగాలు

ప్రభుత్వం మహబూబ్‌నగర్‌లోని పిల్లలమర్రి రోడ్‌లో మెట్టుగడ్డలో ఐదెకరాల స్థలంలో 1987 అక్టోబర్‌లో అంధులకు పాఠశాలను ఏర్పాటు చేశారు. 2002లో దీనిని కళాశాలగా అప్‌గ్రేడ్ చేశారు. ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు హాస్టల్ వసతితో ఇక్కడ ఉచితంగా విద్యను అందిస్తున్నారు. ఆరేళ్లు పూర్తి చేసుకొని 40శాతానికి పైగా దృష్టి లోపం ఉన్న వారు తెలంగాణ ప్రాంతానికి చెందిన ఎవరైనా కుల, మతాలకతీతంగా ఈ ఆశ్రమంలో చేరవచ్చు. 12మందితో ప్రారంభమైన ఈ పాఠశాలలో ఇప్పటివరకు 25 బ్యాచ్‌లకు సంబంధించి 800 మంది విద్యను అభ్యసించారు. ఇందులో దాదాపు 300 మంది ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. 50మంది ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. ఇక్కడే చదివిన రాఘవేందర్‌రెడ్డి, హరీశ్‌కుమార్ పీహెచ్‌డీలు పూర్తి చేశారు. ప్రస్తుతం పాఠశాలలో 70మంది విద్యార్థులు చదువుతున్నారు.

అన్ని వసతులతో కూడిన విద్య

అంధ విద్యార్థులు ఇక్కడ ఒకటి నుంచి ఇంటర్ వరకు చదువుకునేందుకు అన్ని వసతులున్నాయి. విశాలమైన తరగతి గదులు, మైదానం, పిల్లల పార్క్ వంటి సౌకర్యాలు కల్పించారు. బాలురు, బాలికలకు ప్రత్యేక హాస్టల్ వసతి ఉంది. వైద్య చికిత్స, దుస్తులు, తదితర అన్ని సౌకర్యాలు ఉచితమే. సిబ్బంది విద్యార్థులకు 24 గంటలూ అందుబాటులో ఉంటున్నారు. పదోతరగతి వరకు అన్ని సబ్జెక్టులు బోధిస్తున్నారు. బ్రెయిలీ లిపితో పాటు సౌండ్ రికార్డింగ్‌తో విద్యార్థులకు బోధన చేస్తున్నారు.

- ఈ విద్యాసంవత్సరంలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు కొత్తగా ఇంగ్లిష్ మీడియంను ప్రవేశపెట్టారు. ఔట్‌సోర్సింగ్‌లో ఐదుగురు సిబ్బందిని నియమించుకొని విద్యార్థులకు బోధన చేయిస్తున్నారు. గతంలో విద్యార్థుల ఆరోగ్యాన్ని పరీక్షించేందుకు ఓ నర్సు అందుబాటులో ఉండగా.. ఆమె 2017లో రిటైర్డ్ అయ్యారు. ప్రస్తుతం ఎప్పటికప్పుడు విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులు తెలుసుకునేందుకు ఓ ఉపాధ్యాయుడిని నియమించారు.

చదువులో ప్రశంసలు.. ఆటల్లో ప్రతిభ..

సకలాంగులకు సమానంగా ఇక్కడి విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటల్లోనూ సత్తా చాటుతున్నారు. 1997–98, 2000–01లో పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రస్థాయిలో ఉత్తమ పాఠశాలగా ఎంపికైంది. దీంతో అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. అలాగే 2002 నుంచి 2019 వరకు ఇక్కడ ఇంటర్ చదివిన 300 మంది విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించారు. అలాగే టెక్నికల్, సంగీతం, పీఈటీ తరగతులు నిర్వహిస్తారు. జాస్, కృజ్వల్, ఓపెన్ బుక్, కర్జ్‌వెల్, విండోస్ ఐ, తదితరు సాఫ్ట్‌వేర్లతో విద్యార్థులకు కంప్యూటర్‌లో శిక్షణ ఇస్తున్నారు.

- ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన అంధుల క్రీడల్లో ఈ పాఠశాల నాలుగు సార్లు ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను సొంతం చేసుకుంది.
- జపాన్‌లో జరిగిన అంతర్జాతీయ జూడో పోటీల్లో వెంకటేశ్ రెండో స్థానంలో నిలిచాడు.
- పారాఒలింపిక్స్ చెస్‌లో మూడో స్థానంలో నిలిచిన బి.వెంకటేష్ కాంస్యపతకం పొందాడు.
- నేపాల్‌లో జరిగిన క్రికెట్ టోర్నీలో మధు జాతీయ జట్టుకు ప్రాతినిథ్యం వహించాడు.

విద్యార్థుల విజయమే నాకు సంతోషం..



మాది అచ్చంపేట మండలం ఉర్సు రంగాపూర్. నాకు ఏడాది వయసు ఉన్నప్పుడు అంధత్వం వచ్చింది. ఉప్పునుంతలకు చెందిన ఉపాధ్యాయుడు సాయిలు నన్ను హైదరాబాద్‌లోని దారుష్ప అంధుల పాఠశాలలో చేర్పించారు. ఆ తర్వాత నాంపల్లిలో ఇంట ర్, నిజాం కాలేజీలో డిగ్రీ, ఓయూలో బీఈ డీ, ఎంఈడీ, ఆర్ట్స్ కళాశాలలో ఎంఏ తెలు గు పూర్తి చేశాను. మహబూబ్‌నగర్ బ్లైండ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పాలమూరులో ఎ క్కువ మంది అంధులు ఉన్నారని రిపోర్ట్ త యారు చేసి, అప్పటి ప్రభుత్వంతో పోరాడి ఇక్కడ అంధుల ఆశ్రమ పాఠశాల సాధించాం. ఇద్దరు విద్యార్థులు పీహెచ్‌డీ తీసుకోవడం, రెండుసార్లు రాష్ట్రస్థాయిలో అవార్డు అందుకోవడంతో పాటు ఇక్కడి విద్యార్థులు ఆటల్లో జాతీయస్థాయిలో విజయం సాధించడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చింది. – వంగ రాములుగౌడ్, అంధుల ఆశ్రమ పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్

చూపువచ్చే అవకాశం కోల్పోయాను..



నాకు ఒకటిన్నర సంవత్సరాలు ఉన్నప్పుడు చూపుపోయింది. డాక్టర్లు పరీక్షలు చేసి 13–14 ఈ మధ్య వయసులో చికిత్స చేసే చూపు వస్తుందని చెప్పారు. ఆ సమయంలో మా అమ్మకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో చికిత్స చేయించలేక చూపు వచ్చే అవకాశం కోల్పోయాను. మా పట్ల కొందరు దయ చూపిస్తారు, గేలి చేస్తారు. చూపులేదని ఎప్పుడూ బాధ పడలేదు. ప్రయాణ సమయంలో కాస్త ఇబ్బంది అవుతుంది. నేను కరీంనగర్ అంధుల పాఠశాలలో పనిచేస్తున్నప్పుడు కంప్యూటర్‌లను ప్రవేశపెట్టగా.. సొంతంగా 'ప్రయత్న దోష సిద్ధాంతం' (ట్రయల్ అండ్ ఎర్రర్ సిస్టం) ద్వారా కంప్యూటర్ నేర్చుకున్నాను. శబ్ద తరంగాలను వినడం ద్వారా కంప్యూటర్‌ను పని చేయించి విద్యార్థులకు బోధిస్తున్నాం. – శ్యాంసుందర్‌రావు, ఉపాధ్యాయుడు

కాంగ్రెస్‌పార్టీలో భగ్గుమంటున్న వర్గపోరు

వనపర్తి: దశాబ్దాలుగా రాష్ట్ర రాజకీయాల్లో కీలక నేతగా పేరొందని మాజీ మంత్రి, ఏఐసీసీ కార్యదర్శి, రాష్ట్ర క్రమశిక్షణా సంఘం చైర్మన్ డా. చిన్నారెడ్డికి సొంత పార్టీలోనే అసమ్మతి సెగ రోజురోజుకు పెరుగుతోంది. ఎన్నికల సమయంలో పలుమార్లు ఇదే చివరిసారి పోటీ అంటూ నాయకులను ఉత్తేజపర్చేందుకు చేసిన వ్యాఖ్యలు నేడు అసమ్మతి వర్గానికి విమర్శనాస్త్రాలుగా మారాయని చెప్పవచ్చు. 2018 సాధారణ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తే కొందరు సహకరించలేదు.. వారివల్లే ఓడిపోయానంటూ చేసిన ఆరోపణలతో జిల్లా కాంగ్రెస్‌లో సీనియర్లు కొందరు చిన్నారెడ్డికి వ్యతిరేకంగా వర్గాన్ని తయారుచేశారు. గత నెల 21న షాద్‌నగర్ సమీపంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో అసమ్మతి వర్గం ప్రత్యేక సమావేశం నిర్వహించుకొని చిన్నారెడ్డి హటావో.. కాంగ్రెస్‌కు బచావో అంటూ నినాదాలు చేశారు. ఇదే జిల్లా కాంగ్రెస్‌లో అగ్గిరాజేసినట్లయింది. ఇందుకు సీరియస్‌గా స్పందించిన చిన్నారెడ్డి మాజీ డీసీసీ అధ్యక్షుడు శైలం శంకర్‌ప్రసాద్‌కు షోకాజ్ నోటీసు ఇవ్వటం, ఇటీవల పార్టీ నుంచి సస్పెండ్ చేయటం చకచకా జరిగిపోయాయి. చిన్నారెడ్డి మినహా మరెవరైనా సరే.. పార్టీ గెలుపునకు పని చేస్తామంటూ అసమ్మతి వర్గం టీపీసీసీ చీఫ్‌ను కలిసి ఫిర్యాదు చేయటంతో పార్టీ రెండుగా చీలిపోయినట్లయిందనే వాదన కాంగ్రెస్ శ్రేణుల్లో నెలకొంది. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో యువ నాయకుడికి అవకాశం ఇవ్వాలంటూ పలువురు సీనియర్ నాయకులు చిన్నారెడ్డికి వ్యతిరేకంగా మంగళవారం రాష్ట్ర రాజధానిలోని గాంధీభవన్ ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు.

గాంధీభవన్‌కు చేరిన పంచాయితీ



గాంధీభవన్ ఎదుట మాజీ మంత్రి చిన్నారెడ్డికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్న జిల్లా కాంగ్రెస్ సీనియర్లు, వారి మద్దతుదారులు

స్పందించని హైకమాండ్.

ఈ పంచాయితీని హైకమాండ్ పట్టించుకోకపోవటంతో పార్టీ కార్యకర్తలు ఎవరి దారి వారు చూసుకునే ప్రయత్నంలో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. జిల్లా కాంగ్రెస్‌లో పరిస్థితులు ఇప్పట్లో చక్కదిద్దుకోవడం కష్టమనే భావన సామాన్య కార్యకర్తల్లో ఉంది.

యువనేత పెట్టిన చిచ్చేనా..?

కొల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ యువనేత, 2018 సాధారణ ఎన్నికల్లో వనపర్తిలో నాటి టీఆర్ఎస్ గెలుపునకు పనిచేసిన యువ నాయకుడు ప్రస్తుతం మాజీ మంత్రి చిన్నారెడ్డితో సన్నిహితంగా ఉంటూ సీనియర్లపై చాడీలు చెప్పడంతోనే కాంగ్రెస్ రెండుగా చీలిపోయినట్లు పార్టీలోని సామాన్య కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. నియోజకవర్గంలోని కాంగ్రెస్ సీనియర్లు అప్పట్లో డ్యుయల్ రోల్ పోషించారని మాజీ మంత్రికి చెప్పి ఈ అగాధాన్ని సృష్టించినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. నిజానిజాలు ఏవైనా.. ప్రస్తుతం రాజుకున్న వైరం ఏ అధిష్టాన నాయకుడితో చర్చలు జరిపినా ఓ గాడిన పడే పరిస్థితి కనిపించటం లేదు.

క్లుప్తంగా

బైక్ కాల్వలోకి దూసుకెళ్లి వ్యక్తి మృతి


బాబుగౌడ్ (ఫైల్)

తాడూరు: మండలంలోని చర్ల ఇటిక్యాలకు చెందిన బాబుగౌడ్(55) జడ్చర్ల మండలంలోని నసురల్లాబాద్‌లో తన అక్క అనారోగ్యంతో మృతిచెందగా ద్విచక్ర వాహనంపై అక్కడికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి పయనమయ్యాడు. మండలంలోని లచ్చిరాంతండా–ఇంద్రకల్ గ్రామాల మధ్య ఉన్న కేఎల్‌ఐ కాల్వ వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి వాహనంతో పాటు కాల్వలో పడగా, అక్కడికక్కడే బాబుగౌడ్ మృతిచెందగా, తన వెంట ఉన్న సోదరుడు గాయాలతో బయటపడ్డాడు. విషయాన్ని తెలుసుకున్న పోలీసులు బాబుగౌడ్ మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య బాలమణితో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

కాల్వలో పడి మత్స్యకారుడు..

కొల్లాపూర్ రూరల్: కేఎల్‌ఐ డీ–4 కాల్వలో పడి మత్స్యకారుడు మృతిచెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని సింగోటం గ్రామ సమీపంలో మంగళవారం ఉదయం జరిగింది. ఎస్‌ఐ బాలవెంకటరమణ తెలిపిన వివరాలు... గ్రామానికి చెందిన పుట్ట కురుమూర్తి(50) తన పొలం సమీపంలోని కేఎల్‌ఐ కాల్వలో చేపలు పట్టడానికి వెళ్లారు. ప్రమాదశాత్తు జారిపడ్డాడు. నీటిలో ఊపిరాడక చనిపోయాడు. ఈ సంఘటనపై మృతుని భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

యువకుడి ఆత్మహత్య


సోమన్న (ఫైల్)

ఆత్మకూర్: జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మండలంలోని ఖానాపూర్‌లో చోటుచేసుకుంది. ఎస్సై మహేష్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సోమన్న(35) కూలీపనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. కుటుంబ అవసరాల నిమిత్తం చేసిన అప్పులు భారమై ఇంట్లో తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈనేపథ్యంలోనే క్షణికావేశానికి గురైన సోమన్న సోమవారం రాత్రి 10గంటల సమయంలో గ్రామ శివారులోని ముక్కెర వెంకటన్నబావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇతనికి భార్య హాజమ్మ, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.


క్షణికావేశంలో వివాహిత..

మహమ్మదాబాద్: చిన్నపాటి కుటుంబ కలహాలతో ఓ వివాహిత క్షణికావేశంతో ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. మండల పరిధిలోని గాధిర్యాల్‌కి చెందిన మంగలి శ్రీనివాస్‌తో తాండూరు మండలం కందనెల్లికి చెందిన మమతతో నాలుగేళ్ల కిత్రం వివాహమైంది. వీరికి 2ఏళ్ల ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్యాభర్తలకు అప్పుడప్పుడు కుటుంబ విషయంలో చిన్న చిన్న గొడవలు జరుగుతుండేవని, ఇదే క్రమంలో మంగళవారం ఇద్దరు గొడవ పడ్డారు. దీంతో క్షణికావేశంలో ఆమె ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబీకులు స్థానికులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. కాగా మహిళ మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

ఆర్థిక ఇబ్బందులతో..

గద్వాల క్రైం: భార్యభర్తల మధ్య నెలకొన్న వివాదం కారణంగా భర్త ఉరేసుకుని మృతి చెందిన సంఘటన మంగళవారం తెల్లవారుజమున పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. వెంకంపేటకు చెందిన భార్యభర్తలు కుర్వ నర్సింహులు(40), పద్మల మధ్య ఆర్థికమైన విషయాలపై తరచూ గొడవలు చోటు చేసుకునేవి. అయితే సోమవారం రాత్రి ఇద్దరి మధ్య మళ్లీ వివాదం చోటు చేసుకుంది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన భర్త ఇంట్లో తెల్లవారుజామున ఉరేసుకుని మృతి చెందాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఈ సంఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టామన్నారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

మహిళ మృతదేహం ఆచూకీ లభ్యం



మాగనూర్: మండలంలోని నల్లగట్టు మారెమ్మవ్వ దగ్గర ఉన్న చైతన్య క్రషర్ ఇటీవల క్వారి గుంతలో పడి గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. ఈ మేరకు మంగళవారం మహిళ మృతదేహం ఆచూకీ లభించినట్లు ఎస్‌ఐ నరేందర్ తెలిపారు. మృతురాలిది గుడెబల్లూరు అని, ఆమె పేరు తాయమ్మ (65), నాలుగురు కుమారులని తెలిపారు. అయితే మృతదేహంపై పేపర్లో వచ్చిన ప్రకటన చూసి పోలీస్‌స్టేషన్‌కు వచ్చామన్నారు. ఈ సందర్భంగా మహిళకు సంబంధించిన వస్తువుల ఆధారంగా మృతదేహం తమ తల్లిదేనని గుర్తించారని ఆయన తెలిపారు. మృతురాలి ఆభరణాలు, చేతి కడియాలను ఆమె కుమారుడికి అప్పగించారు.

■ మహమ్మదాబాద్ మండలం గాధిర్యాల్‌కు చెందిన చాకలి చిన్న ఎల్లయ్య 2005లో చనిపోయాడు. ఇతని పేరు మీద 6.10 ఎకరాల పొలం ఉంది. 2006లో బోరుమోటారు కోసం రూ.45 వేల దీర్ఘకాలిక రుణం తీసుకున్నట్లు ఉంది. ప్రస్తుతం వడ్డీతో కలుపుకొని రూ.1.30 లక్షల బకాయి ఉన్నట్లు రికార్డుల్లో చూపిస్తుంది. అయితే చిన్న ఎల్లయ్య చనిపోయిన అనంతరం 2008లో భూమి కూడా ముగ్గురు కొడుకుల పేరిట విరాసత్ అయ్యింది. దీంతో వారు ఆయా బ్యాంకుల్లో రుణాలు కూడా తీసుకున్నారు. రెండో కుమారుడు బాలయ్య పీఏసీఎస్‌లోనే రెండెకరాల పొలం మీద రూ.1.30 లక్షల దీర్ఘకాలిక రుణం, గొర్రెల లోను కూడా తీసుకున్నాడు. అప్పుడు కూడా వారి తండ్రి పేరిట రుణం ఉన్నట్లు చెప్పలేదు. ఇప్పుడు మాత్రం చనిపోయిన వ్యక్తి పేరు మీద రుణం ఉన్నట్లు రికార్డులు చూపిస్తున్నారు.

■ గండేడ్ మండలంలోని రెడ్డిపల్లికి చెందిన ముసలిగారి నర్సింహారెడ్డి 2013 జనవరిలో చనిపోయాడు. ఇతని పేరు మీద 2017లో రూ.59 వేల రుణం తీసుకున్నట్లు రికార్డుల్లో ఉంది. ఇది వడ్డీతో కలుపుకొని ప్రస్తుతం రూ.99,277 అయ్యింది. చనిపోయిన తర్వాత తాము ఎలాంటి రుణం తీసుకోలేదని కుటుంబీకులు చెబుతున్నారు.

సహకారంలో స్వాహాపర్వం

చనిపోయిన వారి పేరిట దీర్ఘకాలిక, పంట రుణాలు

- తమకేం సంబంధం లేదంటున్న బాధిత కుటుంబాలు
- భవన నిర్మాణం పేరిట రూ.లక్షల్లో గోల్‌మాల్
- ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనూ సిబ్బంది చేతివాటం
- అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన గండేడ్ పీఏసీఎస్



గండేడ్‌లోని పీఏసీఎస్ కార్యాలయం

గండేడ్/ మహమ్మదాబాద్: గండేడ్‌లోని ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం అక్రమాలకు నిలయంగా మారింది. రైతులకు చేదోడు వాదోడుగా ఉంటూ వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందించాల్సిన పీఏసీఎస్‌లో అవినీతి బాగోతం వెలుగుచూస్తోంది. పంట రుణాలతోపాటు దీర్ఘకాలిక రుణాల పంపిణీలో భారీగా అక్రమాలు చోటుచేసుకున్నాయి. చనిపోయిన వారి పేరిట రుణాలు తీసుకోవడంతోపాటు భవన నిర్మాణం పేరిట స్వాహాపర్వం చోటుచేసుకుంది. దీంతో పీఏసీఎస్ రైతులకు బదులు అక్రమార్కులకు కామధేనువుగా మారింది.

3,350 మంది సభ్యులు

గండేడ్ సహకార సంఘం పరిధిలో మహమ్మదాబాద్ మండలంలోని 49 గ్రామ పంచాయతీలు వీటి పరిధిలోని గాధిర్యాల్, నంచర్ల, గండేడ్, పగిడ్యాల్, వెన్నాచేడ్, కొమిరెడ్డిపల్లి గ్రామాలకు చెందిన 3,350 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. వీరికి ఇప్పటి వరకు రూ.12 కోట్ల వరకు పంట రుణాలు, రూ.6 కోట్ల వరకు దీర్ఘకాలిక రుణాలు ఇచ్చారు. అయితే ఇందులో అంతులేని అవినీతి చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. బతికున్న వారి మాట అలా ఉంచితే.. చనిపోయిన వారి పేరిట పంట రుణం ఉండటం గమనార్హం. అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఇలాంటి రుణాలు మొత్తంలో మాఫీ అయ్యాయి. రుణమాఫీ అనంతరం అవే ఫైళ్లను వాడి రుణాలు తీసుకున్నట్లు పీఏసీఎస్ సిబ్బంది రికార్డులు సృష్టించినట్లు తెలుస్తోంది.

భవనాల నిర్మాణం పేరిట..

పీఏసీఎస్ కార్యాలయానికి పక్కా భవనం కోసం ఎనిమిదేళ్లుగా ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గండేడ్‌లో 15 ఏళ్ల క్రితం ఎకరా భూమి కొనుగోలు చేశారు. ఇందులో అర ఎకరా వేరే వాళ్ల పేరిట రిజిస్ట్రేషన్ కాగా.. మిగతా అర ఎకరా ఆన్‌లైన్‌లో లేదు. ఈ క్రమంలోనే భవన నిర్మాణం చేపట్టాలని రూ.3 లక్షలు సంఘం నుంచి కేటాయించి ఒకరికి బాధ్యతలు అప్పగించారు. కానీ ఇప్పటి వరకు నిర్మాణం ప్రారంభించలేదు. కొత్తగా మరోచోట భవన నిర్మాణం కోసం భూమి కొనేందుకు డైరెక్టర్లు, చైర్మన్ కలిసి తీర్మానం చేశారు. ఇందులో రూ.7 లక్షలు భూ యజమానికి చెల్లించారు. అంతలోనే రాజకీయం చోటుచేసుకోవడంతో భూ కొనుగోలు మరుగున పడింది. అలాగే మరో నాయకుడు రూ.5 లక్షలు, ఇంకో నాయకుడు నిర్మాణాల పేరిట అక్రమంగా డబ్బులు వాడుకున్నట్లు సమాచారం. ప్రజా సొమ్ము ఇలా విచ్చలవిడిగా దుర్వినియోగం అవుతున్నా ఉన్నతాధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదు.

ధాన్యం కొనుగోళ్లలో..

రైతులు పండించిన ధాన్యం కొనేందుకు ప్రభుత్వం పీఏసీఎస్‌లకు బాధ్యతలు అప్పగిస్తోంది. అయితే ధాన్యం డబ్బులను సిబ్బంది సంబంధిత రైతులకు ఇవ్వకుండా ఇతరు ఖాతాలో జమచేసి రైతులకు మొండిచేయి చూపారు. ధాన్యం డబ్బుల కోసం రైతులు కాళ్లరిగేలా కార్యాలయాల చుట్టూ తిరిగినా నేడు.. రేపు అంటూ కాలం వెళ్లదీశారు. వరి ధాన్యం కొనుగోళ్ల తూకాల్లో సైతం భారీ అక్రమాలు చోటుచేసుకున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు.

బయట పడిందిలా..

రుణాల జాబితా తీసుకువచ్చి ఆధార్ కార్డులు అడుగడంతో అసలు విషయం బయటపడింది. తల్లిదండ్రులు చనిపోయినా రుణం ఉంది కట్టాలని పేర్కొనడంతో ఖంగుతింటున్నారు. రెడ్డిపల్లిలో దాదాపు 16 మంది చనిపోగా.. వారి పేరిట రుణాలు ఉండటం.. వడ్డీలు పెరుగుతున్నాయి. దీంతో సంబంధిత అధికారులు ఎక్కడ తమ అవినీతి బండారం బయటపడుతుందోనని ఆయా రైతుల పేరిట పంట రుణాలను తీసి దీర్ఘకాలిక రుణాలకు అనువదించారు. ఇలాంటివి ప్రతి గ్రామంలో ఉన్నాయి. ఇదంతా సహకార సిబ్బంది ఆడుతున్న నాటకమని బాధితులు ఆరోపిస్తున్నారు.

రుణమే తీసుకోలేదు..



మా నాన్న 2013లో చనిపోతే 2017లో రుణం తీసుకున్నట్లు చూపిస్తున్నారు. రుణం తీసుకున్నప్పటి నుంచి మేం అడిగే వరకు అప్పు బాకీ ఉన్నట్లు చెప్పలేదు. ఇప్పుడు వచ్చి ఆధార్ కార్డు అడుగుతుండటంతో ఎందుకని ఆరాతీస్తే క్రాప్‌లోన్ ఉన్నట్లు చెప్పారు.

– రవీందర్‌రెడ్డి, రెడ్డిపల్లి

రూ.లక్ష కట్టాలంట..



2015లో మా నాన్న నర్సయ్య చనిపోతే.. 2017లో ఆయన పేరిట క్రాప్ లోన్ తీసుకున్నట్లు పీఏసీఎస్ సిబ్బంది చెబుతున్నారు. రూ.61 వేలకు వడ్డీతో కలిపి రూ.1.03 లక్షలు కట్టమంటున్నారు. ఆ డబ్బులు ఒక్క రూపాయి కూడా మేం తీసుకోలేదు. అలాంటప్పుడు బాకీ డబ్బులు మేం ఎలా కడతాం. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం.

– మహేశ్, రెడ్డిపల్లి

అక్రమాలు జరగలేదు..

రుణాల పంపిణీలో ఎలాంటి అక్రమాలు జరగలేదు. చనిపోయినవారి పేరిట రుణాలు తీసుకున్నారనడంలో వాస్తవం లేదు. 2017, 18లో రైతులు వడ్డీ కట్టకుంటే ప్రభుత్వం ఇచ్చిన 7 శాతం వడ్డీని సర్దుబాటు చేశాం. కొందరు రైతులు దీర్ఘకాలిక రుణాలు తీసుకుని కట్టకపోతే పంట రుణం ఇచ్చి సర్దుబాటు చేశాం.

– ఆశన్న, సీఈఓ

కాపర్ల మధ్య ఘర్షణ.. ఒకరు మృతి

దోమలపెంట: మేకలు కాస్తున్న ఇద్దరి మధ్య చోటుచేసుకున్న ఘర్షణలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి ఈగలపెంట ఎస్‌ఐ కృష్ణదేవ్ కథనం ప్రకారం.. లింగాలఘాట్ (కర్నూలు జిల్లా పరిధి)కు చెందిన శ్రీను వద్ద అమ్రాబాద్ మండలంలోని అక్కారం గ్రామానికి చెందిన వెంకటయ్య(29), లింగాలఘాట్‌కు వెంకటేశ్వర్లు మేకల కాపరులుగా పనిచేస్తున్నారు. అయితే మూడు రోజుల క్రితం అమ్రాబాద్ పరిధిలోని వజ్రాలమడుగు వద్ద మేకలు కాస్తున్న సందర్భంలో వీరిద్దరి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘటనలో వెంకటేశ్వర్లు కొట్టిన దెబ్బలకు వెంకటయ్య తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన మంగళవారం వెలుగులోకి రావడంతో పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్ దొంగతనం

బిజినేపల్లి: మండలంలోని వట్టెం గ్రామానికి చెందిన మావిళ్ల తిరుపతయ్య బిజినేపల్లిలో టీఎస్ 31 డీ 8636 అనే ద్విచక్ర వాహనాన్ని నిలిపి ఉంచగా, గుర్తు తెలియని వారు దొంగిలించారు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ కృష్ణ ఓబుల్‌రెడ్డి తెలిపారు.

వ్యక్తికి రిమాండ్

బిజినేపల్లి: మండల కేంద్రానికి చెందిన శివకృష్ణ అనే యువకుడిని రెండు ద్విచక్ర వాహనాల దొంగతనం కేసులో మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ కృష్ణ ఓబుల్‌రెడ్డి తెలిపారు. శివకృష్ణ అనే వ్యక్తి నాగర్‌కర్నూల్ పట్టణంలో ఏపీ 22 ఏఏ 6888, టీఎస్ 31 3847 అనే నంబర్ గల వాహనాలను దొంగిలించినట్లు గుర్తించారు.

పాదచారుడిని ఢీ కొట్టిన వాహనం

- వనపర్తి జిల్లాకు చెందిన వ్యక్తి మృతి


దత్తయ్య (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: రోడ్డు దాటుతున్న పాదచారుడిని బొలెరో ట్రాలీ వాహనం ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరిశీలించిన వైద్యులు మార్గ మధ్యలోనే మృతిచెందినట్టు వెల్లడించారు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ ప్రసాద్‌రావు కథనం ప్రకారం...వనపర్తి జిల్లా ఖిల్లా ఘనపూర్ మండలం ఉప్పరిపల్లి గ్రామానికి చెందిన దత్తయ్య(44) బతుకుదెరువు కోసం వచ్చి పటాన్‌చెరులోని భగత్‌గల్లీలో నివాసం ఉంటున్నాడు. పటాన్‌చెరు పారిశ్రామికవాడలోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం 6.30 గంటలకు డ్యూటీకి వెళ్తుండగా నవపాన్ సమీపంలో రోడ్డు దాటుతుండగా బొలెరో ట్రాలీ ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడ్డాడు. దత్తయ్యను చికిత్స కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, పరిశీలించిన వైద్యులు మార్గమధ్యలోనే మృతిచెందినట్లు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పూజారిగది కూల్చిన అటవీశాఖ అధికారులు

అమ్రాబాద్: నల్లమల అటవీ ప్రాంతంలో అమ్రాబాద్‌కు సమీపంలో ఉన్న అంతర్‌గంగా క్షేత్రంలో పూజారి గది నిర్మాణాన్ని అటవీశాఖ అధికారులు కూల్చివేసినట్లు భక్తులు ఆరోపిస్తున్నారు. క్షేత్రంలో శివుడు ప్రతిష్టింపబడి ఉన్నాడు. మరుగున పడి ఉన్న ఆలయాన్ని భక్తులు గత పది సంవత్సరాల కిందట ఆలయాన్ని నిర్మించి వెలుగులోకి తెచ్చారు. అప్పటి నుంచి ఇక్కడ నిత్య పూజలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో రెండు సంవత్సరాల నుంచి ఈదమయ్య అనే పూజారి అక్కడనే ఉంటూ దీపారాధనలు నిర్వహిస్తున్నాడు. అతను ఉండేందుకు పూర్వ మనులు నిర్మించుకున్న తపస్సు మందిరాన్ని పునర్ఃనిర్మాణం చేసుకున్నాడు. అయితే అటవీశాఖ అధికారులు అడవిలో అనుమతిలేని నిర్మాణాలు చేపట్టవద్దంటూ గదిని కూల్చివేయడంతో భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇద్దరి అదృశ్యం

బిజినేపల్లి: మండల కేంద్రానికి చెందిన బోనాసి ఎల్లమ్మ(60) డిసెంబర్ 30వ తేదీ నుంచి కన్పించడం లేదని కుటుంబ సభ్యులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే మండలంలోని మంగనూర్‌కు చెందిన 45 ఏళ్ల బొట్కా కల్యాణి అనే మహిళ జనవరి 2వ తేదీ నుంచి కన్పించడం లేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్‌ఐ కృష్ణ ఓబుల్‌రెడ్డి తెలిపారు.

తల్లి మందలించిందని..


లింగప్ప

మక్తల్: గంటల తరబడి సెల్‌ఫోన్ ఎందుకు చూస్తావంటూ తల్లి మందలించడంతో కుమారుడు కనిపించకుండా పోయాడు. ఈ సంఘటన మక్తల్‌లో చోటుచేసుకుంది. ఎస్‌ఐ పర్వతాలు తెలిపిన వివరాలు.. యాదవనగర్‌కు చెందిన లింగప్ప(15) గొర్రెల కాపరి. తల్లి మందలించడంతో ఈనెల 1న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. రెండ్రోజులైనా తిరిగి రాకపోవడంతో తల్లి శంకరమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టామని ఎస్‌ఐ తెలిపారు.



కృష్ణాలో తగ్గుతున్న నీటిమట్టం

జీవనది కృష్ణానదిలో నీటిమట్టం క్రమంగా తగ్గుముఖం పడుతోంది. విద్యుదుత్పత్తి, సాగు, తాగునీటి అవసరాల కోసం నీటిని ప్రతినిత్యం ఎత్తిపోయడం, శ్రీశైలం ప్రాజెక్టు ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తుండడంతో శ్రీశైలం బ్యాక్‌వాటర్ లెవల్ తగ్గిపోతోంది. సోమశిల వద్ద నీటిమట్టం తగ్గుతుండటంతో నదిలో మునిగిన మసీద్ ఇప్పటికే పూర్తిగా, సంగమేశ్వరాలయం సగం మేరకు తేలాయి. ఇదే స్థాయిలో నీటిమట్టం తగ్గితే మరో రెండువారాల్లో సంగమేశ్వరాలయం పూర్తిగా తేలి భక్తులకు దర్శనభాగ్యం కలగనుంది.

- కొల్లాపూర్

కలుపు నివారణతో అధిక దిగుబడి


జడ్చర్ల మండలంలో పత్తి చేనులో కలుపు తీస్తున్న కూలీలు (ఫైల్)

- కలుపు రకాన్ని బట్టి మందు పిచికారీ
- తగిన సమయంలో సరైన మోతాదులోనే వాడాలి
- జిల్లా వ్యవసాయాధికారి వెంకటేష్

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): వరిలో కలుపు నివారించడం ద్వారానే ఆశించిన దిగుబడి పొందే అవకాశం ఉంటుంది. సాధారణంగా మొలిచే కలుపును కూలీలతో తీయించేవారు. ప్రస్తుతం కూలీల కొరతతో పాటు కూలిరేట్లు విపరీతంగా పెరగడంతో రైతులు ఇతర పద్ధతులపై ఆధారపడుతున్నారు. కలుపును నివారించేందుకు అనేక రకాల హెర్బిసైడ్ లు ప్రస్తుతం మార్కెట్‌లో అందుబాటులో ఉన్నా యి. మార్కెట్‌లో లభించే రసాయనిక మందులను ఇష్టం వచ్చినట్లుగా వాడితే లాభం కంటే నష్టమే అధికంగా ఉంటుంది. ఏ రకమైన కలుపు మొక్కల కు ఏ మందు, ఎంత మోతాదులో వాడాలనే విషయమై రైతులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి వెంకటేష్ వెల్లడించారు.

డ్రమ్ సీడర్, నేరుగా వెదజల్లే వరిలో..

పైరజో సల్ఫ్యూరాన్, ఈథైల్ 10 శాతం పొడి 80 గ్రాములు ఎకరాకు 20కిలోల ఇసుకలో కలిపి విత్తిన 3 నుంచి ఐదు రోజులలో చల్లుకోవాలి. దాంతో వెడల్పాకు కలుపు మొక్కలు, తుంగను నివారించవచ్చు.

ప్రెటిలాక్లోర్ 30 శాతం, పైరజో సల్ఫ్యూరాన్ ఈథైల్ 0.75 శాతం గుళికలు విత్తిన 3 నుంచి 5 రోజులకు 800 గ్రాములు ఎకరాకు చల్లుకోవాలి. వీటితో వెడల్పాకు కలుపు, తుంగ, ఏకవార్షిక గడ్డి జాతి కలుపును అరికట్టవచ్చు.

కలుపు 2–4 ఆకుల దశలో..

సహాలో ఫాప్ బ్యూటైల్ 10 శాతం ద్రావకం 400 మిల్లీమీటర్లు తీసుకొని 1.5 మిల్లీలీటర్ నీటికి కలిపి ఎకరాకు పిచికారీ చేయడం వల్ల ఊద గడ్డిని నివారించవచ్చు.

ఫెనాక్సీప్రోప్ ఈథైల్ 9.3 ద్రావకం, 250 మిల్లీ లీటర్లు ఎకరాకు పిచికారీ చేయడం వల్ల ఊద, ఏకవార్షిక గడ్డిని నివారించవచ్చు.

మెట్ సల్ఫ్యూరాన్ మిథైల్ 10శాతం, క్లోరిమ్యూరా న్ ఈథైల్ 10 శాతం 8 గ్రాములు పిచికారీ చేయడం వల్ల వెడల్పాకు కలుపు, తుంగను అరికట్టవచ్చు.

పెనాక్సులం 1.02 శాతం, సైహలోపాస్ బ్యూటైల్ 5.1 శాతం ద్రావకాన్ని 800 నుంచి 900 మిల్లీ లీటర్లు పిచికారీ చేయాలి. దాంతో వెడల్పాకు, తుంగ, ఏకవార్షిక గడ్డిజాతి కలుపు చనిపోతుంది.

ట్రయాపామెన్, ఇథాక్సీ సల్ఫ్యూరాన్‌ను 90 గ్రాములు ఎకరాకు పిచికారీ చేసుకోవాలి.

సరైన మందులతో తేలికగా నివారణ



వరిలో కలుపు నివారణకు అనువైన రసాయనిక మందులు మార్కెట్‌లో లభిస్తున్నాయి. వీటిని వాడి సులువుగా కలుపు నివారించవచ్చు. మొలిచిన కలుపును బట్టి మందును ఎంపిక చేసుకోవాలి. ఎప్పుడు పడితే అప్పుడు కాకుండా సరైన సమయంలో మాత్రమే వినియోగించాలి. సాధారణంగా కలుపు 2–4 ఆకుల దశలో ఉన్నప్పుడు మందును సరైన మోతాదులో పిచికారీ చేస్తే నశిస్తుంది. కలుపును నివారిస్తేనే పంట మొక్కలు బాగా ఎదిగి ఆశించిన దిగుబడులు సాధించే అవకాశం ఉంటుంది.

– వెంకటేష్, జిల్లా వ్యవసాయాధికారి

నాటు వేసిన వరిలో..

నాటు వేసిన 3 నుంచి 5 రోజుల్లోపు ప్రెటిలా క్లోర్ 50 శాతం ద్రావకం 500 మిల్లీ లీటర్లు లేదా ఆక్సాడయార్జిల్ 80 శాతం డబ్ల్యూపీ 50 గ్రాములు లేదా పైరజో సల్ఫ్యూరాన్ ఈథైల్ 70 శాతం నీటిలో కరిగే గుళికలు 120 గ్రాములు లేదా బెన్ సల్ఫ్యూరాన్ మిథైల్ 0.6 శాతం , ప్రెటిలాక్లోర్ 6.0 శాతం, పైరజో సల్ఫ్యూరాన్ ఈథైల్ 0.15 శాతం గుళికలు ఎకరానికి 20 కిలోల ఇసుకలో కలిపి చల్లుకోవాలి.

జాగ్రత్తలు..

కలుపు మందును సిఫారసు చేసిన మోతాదులో అనువైన సమయానికి సరైన పద్ధతిలో మాత్రమే పిచికారీ చేయాలి. మందు పిచికారీకి సరైన నాజిల్‌ను ఉపయోగించాలి. ఖచ్చితమైన సూచన లేకుండా ఇతర సస్యరక్షణ మందులతో కలిపి వాడకూడదు.


ఆముదం పంటలో మొలిచిన కలుపు నివారణకు మందు పిచికారీ చేస్తున్న రైతు (ఫైల్)

కలుపు 4 ఆకుల దశలో..

- కొన్ని రకాల గడ్డి, వెడల్పాకు, తుంగ కలుపు మొక్కలు ఉన్నప్పుడు బిస్పైరిబాక్ సోడియం 10 శాతం ద్రావకాన్ని ఎకరాకు 80 నుంచి 100 మిల్లీ లీటర్లు పిచికారీ చేయాలి.
- కొన్ని రకాల వెడల్పాకు కలుపు ఉంటే 2, 4 ఈథైల్ ఎస్టర్‌ను ఎకరాకు 1.0 లీటర్ పిచికారీ చేయాలి.
- పెనాక్సులం 2.67 శాతం ద్రావకం 400 మిల్లీ లీటర్లు ఎకరాకు పిచికారీ చేయడం వల్ల కొన్ని రకాల వెడల్పాకు, తుంగను అరికట్టవచ్చు.
- పెనాక్సులం 1.02 శాతం, సైహలోఫాప్ బ్యూటైల్ 5.1 శాతం ద్రావకాన్ని 800 నుంచి 900 మిల్లీ లీటర్లు పిచికారీ చేసి కొన్ని రకాల వెడల్పాకు కలుపు, తుంగ, ఏకవార్షిక గడ్డి జాతి కలుపును నివారించవచ్చు.
- ట్రయాఫామోన్, ఇథాక్సి సల్ఫ్యూరాన్‌ను 90 గ్రాములు ఎకరాకు పిచికారీ చేసుకోవాలి.

క్లుప్తంగా...



గడికోటను సందర్శిస్తున్న కేంద్ర సాంస్కృతిక శాఖ సహాయ మంత్రి మీనాక్షి లేఖి

కాకతీయుల నిర్మాణాలు భేష్

కేంద్ర మంత్రి మీనాక్షి లేఖి

దోమకొండ: కాకతీయుల కాలం నాటి కట్టడాలు అద్భుతమని కేంద్ర సాంస్కృతిక శాఖ సహాయ మంత్రి మీనాక్షి లేఖి పేర్కొన్నారు. ఆమె మంగళవారం సాయంత్రం గడికోటను ఆకస్మికంగా సందర్శించారు. గడికోట ముఖ ద్వారం, వెంకటపతి భవనం, పురాతన బావి, నాట్యశాల, మహాదేవుని ఆలయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కామారెడ్డి జిల్లా దోమకొండ గడికోటకు ప్రపంచ స్థాయి యునెస్కో అవార్డు రావడం అభినందనీయమని చెప్పారు. దోమకొండ గడికోటతో పాటు గోల్కొండ కోటకు యునెస్కో అవార్డు వచ్చిందని తెలిపారు. వరంగల్‌లోని రామప్ప దేవాలయాన్ని కూడా పురాతన కట్టడంగా యునెస్కో గుర్తించిందని వివరించారు. రామప్ప దేవాలయం అభివృద్ధి, కట్టడాల పునర్నిర్మాణాలకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేస్తుందని పేర్కొన్నారు.

గల్ఫ్ కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా అందేనా?

ఎనిమిదేళ్లలో 1,400 మంది వలసజీవులు మృతి • అమలుకు నోచుకోని సీఎం కేసీఆర్ హామీ

రాయికల్(జగిత్యాల): ఉన్నఊరిని వదిలి.. కన్నవారిని విడిచి.. ఉపాధి కోసం ఉసూరుమంటూ ఎడారి దేశాలకు వెళ్తున్న కార్మికులకు ఎంత కష్టం! ఎంత నష్టం! పూటగడవక, పొట్ట నిండక పడరాని పాట్లు పడుతూ కొందరు, ప్రమాదవశాత్తు మరికొందరు గల్ఫ్ దేశాల్లో ప్రాణాలు వదులుతున్నారు. ఎనిమిదేళ్లలో సుమారు 1,400 మంది విగతజీవులుగా మారారు. ఇలాంటి వారి కుటుంబాలకు పరిహారం చెల్లిస్తామని, ఇందుకోసం బడ్జెట్‌లో రూ.500 కోట్లు కేటాయిస్తామని సీఎం కేసీఆర్ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ నేటికీ కార్యరూపం దాల్చడంలేదనే విమర్శలు ఉన్నాయి.

10 లక్షల మంది వలసజీవులు

తెలంగాణ రాష్ట్రంలోని జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లి, కరీంనగర్, నిజామాబాద్, వరంగల్, రాజన్న సిరిసిల్ల, ఆదిలాబాద్, నిర్మల్ తదితర జిల్లాలకు చెందిన సుమారు 10 లక్షల మంది



కార్మికులు ఉపాధి కోసం అప్పుచేసి యూఏఈ, ఒమన్, ఖతర్, సౌదీ అరేబియా, మస్కట్, సింగపూర్ వంటి దేశాలకు వలస వెళ్లారు. అక్కడ ప్రమాదశాత్తు, ఆర్థిక, ఇతర కారణాలతో ఆత్మహత్యలు చేసుకుంటున్నవారి సంఖ్య క్రమంగా పెరిగిపోతోంది. తమవారి మృతదేహాలను స్వగ్రామాలకు తరలించేందుకు పైరవీలు చేయాల్సిన దుస్థితి నెలకొందని బాధిత కుటుంబాలు కన్నీరుమున్నీరవుతున్నాయి. గత ఎనిమిదేళ్లలో వివిధ జిల్లాలకు చెందిన సుమారు 1,400 మంది వలస కార్మికులు పలు కారణాలతో మృతి చెందినట్లు ఎంబసీ, ఎన్ఆర్ఐ సెల్ అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించాక గల్ఫ్‌లో మృతిచెందిన వారి కుటుంబాలను ఆదుకోవడం కోసం రూ.5 లక్షల పరిహారం అందిస్తామని సీఎం కేసీఆర్ గత ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఇలాంటి వారి కుటుంబాలకు రూ.లక్షల చొప్పున పరిహారం చెల్లించారు. కానీ, స్వరాష్ట్రంలో ఆ ఊసే లేదు.

సాయం అందలేదు



మా ఆయన రాజారెడ్డి. ఉపాధి కోసం దుబాయ్ పోయి 2018 మార్చి 21న గుండెపోటుతో చనిపోయిండు. ప్రభుత్వం నుంచి పైసా పరిహారం రాలేదు. సర్కారు మమ్మల్ని ఆదుకోవాలె.

– శీలం భారతి, కుమ్మరిపల్లి, రాయికల్ మండలం, జగిత్యాల జిల్లా

రూ. లక్ష చెల్లించాం



ఉమ్మడి ఏపీలో గల్ఫ్‌లో మృతిచెందిన వారి కుటుంబాలకు కాంగ్రెస్ హయాంలో రూ.లక్ష చొప్పున పరిహారం చెల్లించాం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత 1,400 మంది చనిపోతే, ఆ కుటుంబాలకు నయాపైసా ఇవ్వలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సాయమందించాలి.

– జీవన్‌రెడ్డి, ఎమ్మెల్సీ, జగిత్యాల జిల్లా

ఆ దాడి వెనుక తెలంగాణ మావోలు!

- ఛత్తీస్‌గఢ్ టేకల్‌గుడియం ఘటనలో 23 మందిపై ఎన్ఐఏ చార్జ్‌షీట్
- ఉమ్మడి వరంగల్‌కు చెందిన 8 మంది మావోయిస్టుల నేతలపై అభియోగాలు
- ఆ ఘటనలో 22 మంది పోలీసుల మృతి, 35 మందికిపైగా గాయాలు
- చర్చనీయాంశంగా మారిన ఎన్ఐఏ చార్జిషీట్



సాక్షిప్రతినిధి, వరంగల్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా టార్రెమ్ పోలీస్‌స్టేషన్ పరిధి టేకల్‌గుడియం సమీపంలో పోలీసులపై జరిగిన దాడి ఘటన వెనుక తెలంగాణకు చెందిన మావోయిస్టు నేతలే కీలకంగా వ్యవహరించారని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) తేల్చింది. ఈ ఘటనకు సూత్రధారులుగా 23 మంది పేర్లను పేర్కొన్న ఎన్ఐఏ.. తెలంగాణ జిల్లాలకు చెందిన ఎనిమిది మంది పేర్లను చార్జ్‌షీట్‌లో చేర్చింది. 2021 ఏప్రిల్ 3న జరిగిన ఈ దాడి ఘటనలో డీఆర్‌జీ, కోబ్రా, సీఆర్‌పీఎఫ్‌లకు చెందిన పోలీసులు 22 మంది మృతి చెందగా, 35 మందికిపైగా గాయపడ్డారు. సుమారు 21 నెలలపాటు విచా రణ జరిపిన ఎన్ఐఏ అధికారులు... దాడిలో 350 నుంచి 400 మంది వరకు సాయుధ మావోయి స్టులు పాల్గొన్న ప్పటికీ కేసులో (ఆర్‌సీ–02/ 2021/ఎన్ఐఏ/ ఆర్‌పీఆర్) 23 మందిపైన చార్జ్‌షీట్‌ను దాఖలు చేశారు.

సంచలనం కలిగించిన తారెం ఘటన

పోలీస్ సాయుధ బలగాలపై మెరుపుదాడి చేసిన ఆ ఘటన కేసును మొదట బీజాపూర్ జిల్లాలోని టార్రెమ్ పోలీస్‌స్టేషన్ ఎఫ్ఐఆర్ నం.06/2021 ప్రకారం నమోదు కాగా, తర్వాత ఎన్ఐఏ ద్వారా 2022 జూన్ 5వ తేదీన తిరిగి నమోదు చేశారు. భద్రతా దళాలు సీఆర్‌పీఎఫ్, కోబ్రా, డీఆర్‌జీ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర పోలీసులపై బారెల్ గ్రెనేడ్ లాంచర్(బీజీఎల్)లు, ఆటోమేటిక్ ఆయుధాలతో కాల్పులు జరిపి రాకేశ్వర్ సింగ్ మన్హాస్ అనే కోబ్రా జవాన్‌ను కూడా అపహరించారు. ఈ ఘటన అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనం కలిగించింది.

తెలంగాణ అగ్రనేతలే సూత్రధారులు...

21 నెలల విచారణ తర్వాత ఎన్ఐఏ తన దర్యాప్తులో దాడి వెనుక సీపీఐ(మావోయిస్ట్) సీనియర్ నేతల పాత్ర ఉందని తేల్చింది. ఐపీసీలోని సెక్షన్లు– 120 రెడ్‌విత్/302 – 307, 396, 149, 121 మరియు 121ఎలతో పాటు భారతీయ ఆయుధ చట్టం, 1959లోని సెక్షన్లు– 25(1ఏ) – 27, ఈ చట్టం 1908లోని సెక్షన్ – 3, 4 – 6 మరియు సెక్షన్లు– 16, 18, 18ఏ, 20, యుఏ(పీ) చట్టం, 1967లోని 38ల కింద కేసులు నమోదు చేసి చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఇందులో కేంద్ర కమిటీ సలహాదారుడు ముప్పాళ్ల లక్ష్మణ్‌రావు అలియాస్ గణపతితోపాటు కేంద్ర కమిటీ కార్యదర్శి నంబళ్ల కేశవరావు అలియాస్ గంగన్న, కేంద్ర నాయకులు కటకం సుదర్శన్ అలియాస్ ఆనంద్, మల్లోజుల వేణుగోపాల రావు అలియాస్ సోను, సుజాత అలియాస్ పోతుల కల్పన (మల్లోజుల కోటేశ్వర్‌రావు భార్య), ఉమ్మడి వరంగల్‌కు చెందిన సాగర్ అలియాస్ అన్నె సంతోష్, రఘు రెడ్డి అలియాస్ వికాస్, నిర్మల అలియాస్ నిర్మలక్కలు ఉన్నారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన పొడియం హిద్మా అలియాస్ హిద్మన్న, మద్నా అలియాస్ జగ్గు దాదాలతో పాటు ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర, దండకారణ్యం, ఏరియా కమిటీలకు చెందిన 15 మంది పేర్లను ఎన్ఐఏ ప్రధానంగా పేర్కొంది.

విశ్వవేదికపై చెదరని ఖ్యాతి ఓయూ సొంతం

- వందేళ్ల చరిత్రే ఉస్మానియా ఘనత
- ఉద్యమాల గడ్డ ఉద్యోగాల అడ్డాగా మారింది.. వేలాదిమందికి ఉద్యోగావకాశాల కల్పన
- జీఏఎం–2023లో ఉస్మానియా వర్సిటీ వైస్ చాన్స్‌లర్
- అపూర్వ కలయికగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం





ఉస్మానియా యూనివర్సిటీ గ్లోబల్ అలుమ్నై మీట్–2023'లో మాట్లాడుతున్న సీవీ ఆనంద్. చిత్రంలో బుర్రా వెంకటేశం, శేఖర్ కమ్ముల. (ఇన్‌సెట్‌లో) వర్సిటీ వైస్ చాన్స్‌లర్ రవీందర్

సాక్షి, హైదరాబాద్: వందేళ్లు దాటిన మహోన్నత చరిత్ర కలిగిన ఉస్మానియా విశ్వవిద్యాలయం తనకు తానే ఒక బ్రాండ్ ఇమేజ్ అని, ప్రపంచ ప్రసిద్ధి చెందిన విశ్వవిద్యా లయాల్లో చెక్కుచెదరని స్థానం కలిగి ఉందని వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ డి.రవీందర్ అన్నారు. గతేడాది రూపొందించిన ప్రపంచంలోని అత్యుత్తమ విశ్వవిద్యాలయాల జాబితాలో ఉస్మానియా 22వ స్థానంలో ఉందని చెప్పారు. ఇటీవల వరకు ఉద్యమాల అడ్డగా ఉన్న ఉస్మానియా వర్సిటీ ఇప్పుడు ఉద్యోగాల గడ్డగా మారిందని పేర్కొన్నారు. 'ఉస్మానియా యూనివర్సిటీ గ్లోబల్ అలుమ్నై మీట్–2023' వేడుకలు మంగళవారం వర్సిటీలోని ఠాగూర్ ఆడిటోరియంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మినారాయణ స్వాగతోపన్యా సం చేశారు. రెండు రోజులపాటు జరగనున్న ఈ వేడుకలలో పాల్గొనేందుకు దేశ, విదేశాల్లో స్థిరపడిన వేలాదిమంది 'ఉస్మానియన్స్' తరలివచ్చారు. వైస్ చాన్స్‌లర్ మాట్లాడుతూ టీచింగ్, లెర్నింగ్ మెథడ్స్, రీసెర్చ్ రంగంలో అత్యున్నత ప్రమాణాలను అభి వృద్ధి చేసినట్లు, అనేక సంస్కరణలను ప్రవేశపెట్టి నట్లు పేర్కొన్నారు. ఇటీవల ఓయూ నిర్వహించిన 'నిపుణ' కార్యక్రమంలో 250 క్యాంపస్‌లు పాల్గొన్నాయని, 55 వేలమంది విద్యార్థులు హాజరయ్యారని, సుమారు 16 వేలమందికి ఉద్యోగాలు లభించాయని వివరించారు. ఉస్మానియా ఫౌండేషన్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న వర్సిటీ పూర్వ విద్యార్థులను ఒక వేదికపైకి తీసుకురాగలిగినట్లు చెప్పారు. వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వవిద్యార్థుల సహాయ సహకారాలతో అనేక అభివృద్ధి కార్యక్ర మాలు చేపట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో ఆయన ఉస్మానియా టీవీని లాంఛనంగా ప్రారంభించారు.

చదువులమ్మ చెట్టు నీడలో...

పూర్వవిద్యార్థుల ప్యానెల్ సమావేశంలో బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నర్సింహారెడ్డి, సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం, నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, సినీ దర్శకులు శేఖర్ కమ్ముల, ప్యూజీ సీఈవో మనోహర్‌రెడ్డి, ఓఎస్‌డీ రాజశేఖర్ వర్సిటీతో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఎక్కడో నల్లమల అటవీ ప్రాంతంలో పుట్టి పెరిగిన తనను ఉస్మానియా కన్నతల్లిలా చేరదీసిందని చెప్పారు.

సీఆర్‌పీఎఫ్ క్యాంపుపై మావోల దాడి

బీజాపూర్ జిల్లాలో ఘటన

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా పామేడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ధర్మారం సీఆర్‌పీఎఫ్ 151 బెటాలియన్ క్యాంపుపై మావోయిస్టులు దాడికి దిగారు. మంగళవారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో క్యాంపునకు సమీపాన ఉన్న చింతవాగు అవతలి వైపు నుంచి నాలుగు రౌండ్లు కాల్పులు జరిపారు. దీంతో అప్రమత్తమైన సీఆర్‌పీఎఫ్ జవాన్లు ఎదురు కాల్పులకు దిగడంతో మావోయిస్టులు పారిపోయారు. గత ఏడాది ఫిబ్రవరిలో కూడా మావోయిస్టులు ఇదే క్యాంపుపై లాంచర్లతో దాడి చేసి చింతవాగుపై వంతెన నిర్మాణానికి తీసుకొచ్చిన యంత్ర పరికరాల దహనానికి యత్నించగా బలగాలు ప్రతిఘటించడంతో పారిపోయారు. కాగా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కాంకేర్ జిల్లా బద్గాస్ పోలీస్ స్టేషన్ పరిధి మెంద్రాలో సోమవారం అర్ధరాత్రి మొబైల్ టవర్ ప్యానల్ బాక్సుకు మావోయిస్టులు నిప్పంటించారు. ఈ ఘటనలో ప్యానల్ బాక్సు పాక్షికంగా దగ్ధమైంది. 2 నెలల క్రితం బీజాపూర్ జిల్లాలో అండర్ గ్రౌండ్ ఫైబర్ వేసేందుకు తవ్వకాలు జరుపుతున్న ఓ ప్రైవేట్ నెట్‌వర్క్ జేసీబీలను కూడా దహనం చేశారు.

జనరల్ ఆస్పత్రిలో శిశువు మృతి

- వైద్యుల నిర్లక్ష్యమేనని కుటుంబసభ్యుల ఆందోళన
- ఉమ్మనీరు మింగడంతో మృతిచెందారని వివరణ



జనరల్ ఆస్పత్రిలో ఆందోళన చేస్తున్న కుటుంబసభ్యులు

నాగర్‌కర్నూల్ క్రైం: వైద్యుల నిర్లక్ష్యంతో శిశువు మృతిచెందిదంటూ ఆరోపిస్తూ కుటుంబసభ్యులు ఆందోళన దిగిన సంఘటన జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో మంగళవారం చోటుచేసుకుంది. బాధిత కుటుంబసభ్యులు తెలిపిన సమాచారం మేరకు.. మున్సిపాలిటీ పరిధిలోని ఎండబెట్లకి చెందిన రేణుకకు పురిటినొప్పులు రావడంతో మొదటి కాన్పుకోసం సోమవారం ఉదయం జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రికి తీసుకురాగ పరిశీలించిన వైద్యులు ఆమెను అడ్మిట్ చేసుకున్నారు. వైద్యులు ఆమెకు సాధారణ ప్రసవం అవుతుందని వేచి ఉండాలని చెబుతూ వస్తున్నారు. మంగళవారం తెల్లవారుజామున పురిటినొప్పులు అధికం కావడంతో కుటుంబసభ్యులు సిజేరియన్ ఆపరేషన్ చేయాలని కోరారు. అయితే వైద్యులు సాధారణ ప్రసవం చేయడంతో మగశిశువు మృతిచెందింది. శిశువు మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ ఆరోపిస్తూ కుటుంబసభ్యులు జనరల్ ఆస్పత్రిలో ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీలు ఆస్పత్రి వద్దకు వచ్చి కుటుంబసభ్యులను నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు. ఈ సంఘటనకు సంబంధించి జనరల్ ఆస్పత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డా. సూర్య నారాయణను వివరణ కోరగా శిశువు మృతికి వైద్యుల నిర్లక్ష్యం కాదని, శిశువు ఉమ్మనీరు మింగడంతో మృతిచెందాడని, సంఘటనకు సంబంధించి పూర్తి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

15నుంచి సింగోటంలో బ్రహ్మోత్సవాలు



సింగోటం లక్ష్మీనరసింహస్వామి ఆలయం

- ఏర్పాట్లు చేపట్టిన ఆలయ కమిటీ
- ప్రారంభం కాని రోడ్ల మరమ్మతులు

కొల్లాపూర్: భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న సింగోటం లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 15వ తేదీ నుంచి ప్రారంభంకానున్నాయి. ఉత్సవాల కోసం ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నారు. ఉత్సవాల నిర్వహణ కోసం అధికారులు చర్యలు చేపట్టారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఉత్సవాలు ముగిశాక దాదాపుగా నెలరోజుల పాటు సాగే జాతర కూడా కొనసాగనున్న నేపథ్యంలో అవసరమైన చర్యలు చేపడుతున్నారు.

15 నుంచి 21వరకు బ్రహ్మోత్సవాలు

లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు 15వ తేదీ నుంచి 21వరకు కొనసాగనున్నాయి. 15న బ్రహ్మోత్సవాలు ప్రారంభం, 16న కల్యాణోత్సవం, 17న ప్రభోత్సవం, 18న తేరు మహోత్సవం, 19న తెప్పోత్సవం, 20న ప్రత్యేక పూజలు, 21న ఉత్సవాల ముగింపు. అనంతరం నెలరోజుల పాటు ఆలయం వద్ద జాతర కొనసాగుతుంది. ఈ ఉత్సవాలకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు వేలాదిగా విచ్చేస్తారు. రాయలసీమ ప్రాంతం నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివస్తారు.

ఉత్సవాలకు స్వాగతం..

బ్రహోత్సవాలకు ముందు పెద్దకొత్తపల్లి మండలం గంట్రావుపల్లి గ్రామానికి చెందిన భక్తులు ఉత్సవాలకు స్వాగతం పలకడం ఆనవాయితీ. ఈనెల 2వ తేదీన గంట్రావుపల్లి గ్రామస్థులు పెద్దసంఖ్యలో



రథాన్ని శుభ్రం చేస్తున్న సిబ్బంది

ఆలయానికి వచ్చి సంప్రదాయబద్ధంగా పూజలు చేస్తారు. దేవతామూర్తులకు నైవేద్యాలు సమర్పించారు. రథాన్ని శుభ్రం చేసి, పూజలు చేశారు. అనంతరం రథాన్ని కొంత ముందుకు లాగి ఉత్సవాలకు స్వాగతం పలికారు. సింగోటం గ్రామానికి చెందిన వివిధ కులాల వారు బ్రహ్మోత్సవాల్లో తమ కార్యాలు నిర్వహిస్తారు.

గుడారాల ఏర్పాటు..

బ్రహ్మోత్సవాల ప్రారంభానికి పదిహేను రోజుల ముందునుంచే ఆలయం వద్ద గుడారాలు ఏర్పాటయ్యాయి. తినుబండారాలు, ఇతర వస్తు సామగ్రితో పాటు, రంగులరాట్నం వంటి క్రీడా సముదాయాలను ఏర్పాటు చేస్తున్నారు. గుడారాల ఏర్పాటుకు సంబంధించిన స్థలాల హద్దులు ముందస్తుగానే నిర్ణయించారు.

రోడ్ల మరమ్మతుపై నిర్లక్ష్యం..

సింగోటం వెళ్లేందుకు చుట్టూ పలు రహదారులు ఉన్నాయి. ప్రధానంగా కొల్లాపూర్ నుంచి, వనపర్తి నుంచి భక్తులు ఎక్కువ సంఖ్యలో వస్తుంటారు. మాచినేనిపల్లి సమీపంలో ప్రధాన మలుపువద్ద రహదారి గుంతలమయంగా ప్రమాదకరంగా ఉంది. నర్సాయిపల్లి నుంచి వచ్చే ప్రాంతంలో కూడా పలుచోట్ల రోడ్డు గుంతలమయంగా ఉంది. వీటిని సరిచేసే పనులు ఇప్పటివరకు ప్రారంభం కాలేదు. అదేవిధంగా జాతర ప్రాంగణంలో గతంలో ఏర్పాటుచేసిన టాయిలెట్లు తలుపులు పగిలిపోయి, నీటివసతి లేకుండా నిరుపయోగంగా ఉన్నాయి. వీటికి మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉంది.

భక్తులకు ఇబ్బంది లేకుండా చూస్తాం

బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం. తాగునీరు, పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నాం. కొత్తగా తాగునీటి పైప్‌లైన్, నల్లాలు ఏర్పాటు చేస్తున్నాం. కొత్తగా టాయిలెట్లు నిర్మించాం. కోనేరు వద్ద రక్షణ చర్యలు చేపడతాం.

– రంగారావు, ఆలయ ఈఓ

భక్తుల కోసం ఏర్పాట్లు..

రత్నగిరి కొండ సమీపంలో మిషన్ భగీరథ పంప్‌హౌజ్ ఉంది. అక్కడి నుంచి రత్నలక్ష్మీ ఆలయానికి, లక్ష్మీ నరసింహ ఆలయానికి కొత్తగా తాగునీటి పైప్‌లైన్ నిర్మిస్తున్నారు. దాదాపుగా రెండు కిలోమీటర్ల మేరకు పైప్‌లైన్ పనులు జరుగుతున్నాయి. ప్రతి 20 మీటర్లకు ఒక చోట్ల నల్లా కనెక్షన్ ఏర్పాటు చేసి భక్తులకు తాగునీటి ఇక్కట్లు లేకుండా చూసేందుకు దేవాదాయ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఇందుకోసం రూ.8లక్షలు ఖర్చు చేస్తున్నారు. అదేవిధంగా రూ.10లక్షల వ్యయంతో టాయిలెట్లు నిర్మిస్తున్నారు. కొత్తగా అన్నసత్రం కోసం దాతలు నిర్మిస్తున్న భవనంలో ప్రాథమిక వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నారు. కోనేటి వద్ద ప్రమాదాలు చోటుచేసుకోకుండా ఇనుప కంచె నిర్మిస్తున్నారు.

ముగిసిన దేహదారుఢ్య పరీక్షలు



పరుగెడుతున్న అమ్మాయిలు

- తుది పరీక్షకు 15,143 మంది అర్హత
- 6,455 మంది ఇంటిముఖం

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గత నెల 8 నుంచి జిల్లా స్టేడియం గ్రౌండ్‌లో నిర్వహించిన ఎస్ఐ, కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. దాదాపు 22 రోజులపాటు ఈవెంట్స్ కొనసాగాయి. దేహదారుఢ్య పరీక్షలకు మొత్తం 23,745 హాజరుకావాల్సి ఉండగా.. 21,598 మంది హాజరవగా 2,147 మంది గైర్హాజరయ్యారు. మంగళవారం దేహదారుఢ్య పరీక్షలకు మొత్తం 1,383 మంది హాజరుకావాల్సి ఉండగా 1,280 మంది హాజరుకాగా.. 103 మంది గైర్హజరయ్యారు. చివరిరోజు మహిళలు, పురుషులకు ఈవెంట్స్ నిర్వహించగా వచ్చిన అభ్యర్థులకు మొదట సర్టిఫికెట్స్ పరిశీలన చేసి ఆ తర్వాత 1600 మీటర్ల పరుగు పోటీ నిర్వహించారు. 1600, 800 మీటర్ల పరుగు పోటీలో వెయ్యి మంది అభ్యర్థులు అర్హత పొందగా ఆ తర్వాత ఎత్తులో 965 మంది, లాంగ్ జంప్‌లో 935 మంది, షాట్‌పుట్‌లో 924 మంది అర్హత సాధించారు. ఇక అన్ని రకాల దేహదారుఢ్య పరీక్షల్లో చివరిరోజు 356 మంది అర్హత సాధించలేకపోయారు. ఇప్పటి వరకు జరిగిన దాంట్లో మొత్తం 15,143 మంది అభ్యర్థులు తుది పరీక్షకు అర్హత సాధించగా.. 6,455 ఇంటిముఖం పట్టారు. దేహదారుఢ్య పరీక్షలను ఎస్పీ వెంకటేశ్వర్లు, ఐపీఎస్ అధికారి చేతన, నోడల్ ఆఫీసర్ రాములు పర్యవేక్షించారు.

పరుగులోనే అధికం

ఎస్ఐ, కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షల్లో మొత్తం 6,455 మంది అభ్యర్థులు అర్హత కోల్పోగా దీంట్లో అత్యధికంగా 1,600 పరుగు పోటీలో వెనకంజ వేశారు. పరుగులో 3,756, ఎత్తులో 1,149, లాంగ్ జంప్‌లో 1,060, షాట్‌పుట్‌లో 490 మంది అర్హత పొందలేదు.



షాట్‌పుట్ వేస్తున్న అమ్మాయి



ఎత్తు చూస్తున్న అధికారులు

ఈ పరిహారం మాకొద్దు

- నోటీసులను తిరస్కరించిన రైతులు
- కలెక్టర్ హామీని అమలు చేయలేదంటూ ఆందోళన

గట్టు: భారత్‌మాల పథకంలో భాగంగా ఆరు వరుసల జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు అధికారులు అందించే పరిహారం నోటీసులను రాయాపురం రైతులు తీసుకోకుండా వెనక్కి పంపారు. మంగళవారం గిర్దావర్ శ్రీనివాసులు, వీఆర్ఏ రాముడులు 107మంది రైతుల వారీగా ఎంత మేరకు భూ సేకరణ చేస్తున్నారు. అందుకు సంబంధిం ఎంత మేరకు పరిహారం ఇస్తున్నారని రైతులు అధికారులను ప్రశ్నించారు. గతంలో గ్రామసభలో జిల్లా కలెక్టర్ చెప్పిన దానికి, అధికారులు చెల్లిస్తున్న పరిహారానికి పొంతన లేకపోవడంతో నోటీసులను తీసుకోకుండానే అధికారులను వెనక్కి పంపారు. ఆరు వరుసల జాతీయ రహదారి నిర్మాణంలో గతంలో ప్రస్తుత జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి గ్రామసభలో రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు రూ.7.39లక్షల పరిహారం ఇవ్వడానికి అంగీకరించినట్లు రైతులు తెలిపారు. అయితే పరిహారం అందించే క్రమంలో మాత్రం ఎకరాకు కేవలం రూ.4.30లక్షల మాదిరిగానే పరిహారం చెల్లిస్తున్నారని, ఇదేమిటని కలెక్టర్ కార్యాలయ అధికారులను ప్రశ్నిస్తే అందరి మాదిరిగానే మీకు పరిహారం చెల్లిస్తున్నట్లు చెబుతున్నట్లు రైతులు వాపోయారు. ఏ ఒక్క రైతు కూడా నోటీసును తీసుకోకపోవడంతో అధికారులు చేసేదేమీ లేక గ్రామం నుంచి కార్యాలయానికి తిరిగి వచ్చారు.



పరిహారం నోటీసులను రైతులకు చూపిస్తున్న రెవెన్యూ అధికారులు

రామన్‌పాడులో పూర్తిస్థాయి నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో మంగళవారం పూర్తిస్థాయి నీటి మట్టం 1,021 అడుగుల వరకు చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 150 క్యూసెక్కులు, సమాంతర కాల్వ ద్వారా 150 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఎన్‌టీఆర్ కాల్వ ద్వార 950 క్యూసెక్కులు, తాగు నీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు.